# ఊరటి వాక్యం

"ఈరోజు శనివారం కాదుగదా?" అన్నాడు కృష్ణమూర్తి, అన్నం బదులుగా చపాతీలు వడ్డించిన భార్యవైపు చూసి.

"కాదనుకోండి. రాణీ వాళ్ళు గ్రైండర్ కొన్నారు. గోదుమపిండి నిముషంలో కలిపేసిం దనుకోండి...." మెచ్చుకోలుగా అంది శాంతి.

"ఓహోఁ — గ్రైండర్ మీద ఎక్స్పరిమెంట్ చేశావన్న మాట. బాగుంది."

"రెండేళ్ళలో ఎంత సామాను కొన్నదండీ రాణి. గాడ్రెజ్ బీరువా, ప్లాస్టిక్ వైరు కుర్చీల సెట్టూ, ప్రెషర్‌కుక్కరూ... కొన్నాళ్ళుపోతే ఫ్రిజ్‌గూడా కొంటారట."

కృష్ణమూర్తి మౌనంగా వింటూ కూర్చున్నాడు.

"ఏమండీ."

"వూఁ...."

"విరల్‌రావు ఇంటికి ఎప్పుడైనా వెళ్ళారా మీరు?"

"వెళ్ళలేదు. ఏం?"

"వెళ్ళివుంటే తెలిసేది."

"ఏమిటో చెప్పరాదూ!"

"నిన్న వాళ్ళమ్మాయి బర్త్‌డే పార్టీకి వెళ్ళానా? ఎంత గ్రాండ్‌గా చేశారనుకున్నారు? వాళ్ళది గుమస్తా ఇంటిలా వుందా? సోఫా సెట్, గ్రైండర్, గాడ్రెజ్ ఫర్నిచర్, ఫ్రిజ్...."

"వింటున్నారా?"

"వూఁ... వూఁ.... చెప్పు."

"ఆయనా మీలాగే గుమస్తా గదా? ఆ డబ్బంతా ఎలా వస్తుందంటారు?"

కృష్ణమూర్తి భార్యవైపు జాలిగా చూశాడు.

"ఎలాగో వస్తుందిలే. మనకెందుకు?"

"ఏం? మనం మనుషులంకాదా? అందరిలా వుండాలని మనకి వుండదా?"

"ఎందుకుండాలి? మనకంటే బాగా బ్రతుకుతున్న వాళ్ళతో పోల్చుకుని బాధపడుతున్నావు గాని, మనకంటే హీనంగా జీవిస్తున్నవాళ్ళతో పోల్చుకుని తృప్తిపడరాదూ? మనం తల దాచుకోవడానికి ఇల్లుంది. రెండుపూటలా భోజనానికి గ్యారంటీ వుంది. అది లేనివాళ్ళని గురించి ఆలోచించవేం? మరొకరి జీవితాలతో పోల్చుకోనంతవరకూ ఫరవాలేదు శాంతీ! తృప్తిగానే బ్రతుకు సాగిస్తాం. మన జీవితాన్ని మరొకరితో పోల్చుకుంటూ వుంటే అసంతృప్తే మిగులుతుంది."

కృష్ణమూర్తి చెప్పే మాటలు చేదుగా వున్నాయి శాంతికి.

'ఏం మనిషో? వట్టి వేదాంతి' అనుకుంది.

"సరే ఇన్ని మాటలెందుకు. మిమ్మల్నొక మాట అడుగుతాను కాదనరుగదా?"

"ఏమిటో?"

"ఏం లేదు. రాణీలాగే నేనూ కుట్టుపని నేర్చుకుంటానండీ. కొన్నాళ్ళుపోతే ఒక మిషన్ కొనుక్కుని కొద్దో గొప్పో సంపాదించుకోవచ్చుగదా" అంది శాంతి.

"ఇప్పుడు ఏమంత అవసరం?"

"డబ్బు సంపాదించుకోవడానికి అవసరాలే రావాలా? ముందు ముందు ఏం అవసరాలు వస్తాయో?"

"అవసరాలుకాదులే. అర్జంటుగా ఫర్నిచరూ, గ్రైండరూ, సోఫా సెట్టూ కొనాలి.... అంతేనా. అయినా నా మాట వింటావుగనుకనా. డబ్బుమాట వింటావుగాని." అని నవ్వాడు కృష్ణమూర్తి.

"మీరు మాత్రం నా మాట ఎప్పుడు విన్నారు? మీరు పట్టిన కుందేటికి మూడుకాళ్ళే గదా!" అంది శాంతి నవ్వుతూ.

*   *   *

పిల్లలకి భోజనంపెట్టి స్కూలుకి పంపించి

భర్తకి వడ్డించింది శాంతి.

కృష్ణమూర్తి ఆఫీసుకి వెళ్ళాక కత్తెర, పాత బట్టలు తీసుకుని మరియమ్మ ఇంటికి వెళ్ళి టైలరింగ్ నేర్చుకోవడం నిత్యకృత్యమై పోయింది శాంతికి.

ఏదో పొందాలనుకుని పొందలేకపోయిన అసంతృప్తి ఆమెను బాధిస్తోంది. బహుశా చాలామందిని అటువంటి అసంతృప్తి వెంటాడుతూ వుంటుందేమో?

తలిదండ్రులయి గొప్ప సంబంధం తెచ్చి పెళ్ళి చేస్తారని ఆమె కలలుకని వుండవచ్చు. కాని కలలు కల్లలయ్యాయి.

కృష్ణమూర్తి భోజనం ముగించి ఆఫీసుకి బయల్దేరాడు?

తనకి వున్నదాన్ని నిర్లక్ష్యంచేస్తూ, తనకి లేనిదానికోసం ప్రాకులాడుతున్న శాంతిని గురించే ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

మనసు గత స్మృతులతో పొంగింది.

పదేళ్ళ క్రితం——

అప్పుడు కృష్ణమూర్తి చిన్న ప్రాజెక్టుకి సంబంధించిన సబ్‌డివిజన్‌లో గుమస్తా.

శాంతి తండ్రి సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజనీర్. సిన్సియర్ అని ఆయనకి గొప్ప పేరుండేది. నిప్పుకైనా చెదలు పట్టవచ్చునేమో గాని సుబ్బారావు నిజాయితీకి మాత్రం మచ్చ లేదు.

ఏ ఆఫీసులోనూ సంవత్సరానికి మించి సుబ్బారావుని పనిచెయ్యనీయలేదంటే అతిశయోక్తి కాదు.

అటు పై ఆఫీసర్లకి, ఇటు కంట్రాక్టర్లకే గాక, మేస్త్రీలకి గుమస్తాలకిగూడా కొరకరాని కొయ్యగా తయారయ్యాడు.

గడ్డివామి దగ్గిర కుక్కలాంటి సుబ్బారావు వల్ల దేశపురోభివృద్ధి కుంటుపడుతుందేమో ననే భయంవల్ల కాబోలు తరచు దేశ నాయకులు జోక్యం చేసుకుంటూ వుండేవారు. ప్లేగ్రౌండ్‌లో ఫుట్‌బాల్‌లా దేశమంతా తిరుగుతూ వుండేవాడు.

సుబ్బారావు గురించి ఎవరేమనుకున్నా కృష్ణమూర్తికి మాత్రం ఎంతో గౌరవం వుండేది.

కాకీ ప్యాంటులో తెల్లటి చొక్కా టక్‌చేసి, నెత్తిమీద టోపీ పెట్టుకుని నల్లటి బూటు వేసుకుని పందేనికి తయారై వచ్చిన గుఱ్ఱంలా హుషారుగా సైటులో కనిపించేవాడు.

సుబ్బారావు రూల్సు కొరడా ఝళిపించడం వల్ల ఆయన దగ్గర పనిచేసే సూపర్‌వైజర్లకి వచ్చే లాభం గంగలో కలిసిందిగాక కంట్రాక్టర్ జగన్నాథం నోట్లో దుమ్ము పడింది. 'అసలుకే మోసం వచ్చింది దేవుడోయ్' అని ఏడవ సాగాడు.

పైన సుబ్బారావులాంటి మరొక దిక్కుమాలిన ఆఫీసరొకాయన తగలబడ్డం వల్ల అతన్ని ట్రాన్స్‌ఫర్ చేయించడంకూడా అసాధ్యమని తెలిసి అంతా కృంగిపోయారు.

ఎవరికీ ఉపయోగపడని యీ ఇంజనీర్ని తొందరగా పంపిస్తే నీ కొండకు వచ్చి కళ్యాణం చేయిస్తామని దేవుడికి మొరపెట్టుకున్న వాళ్ళు గూడా వున్నారు.

కంట్రాక్టర్ జగన్నాథానికే కొరుకుడుపడని ఘటం ఒకడు పుట్టాడని తెలిసి దేశం ఆశ్చర్య పోయింది.

జగన్నాథం రీవి, వేషధారణ చూస్తే ఈ మహానుభావుడు ఏ మంత్రిగారి వారసుడో అని ఎవరికైనా అనిపించక మానదు. కొందరు ఆ రాజకీయ రీవిని వుగ్గుపాలతోనే నేర్చుకుంటారు.

ఆయనంటే కూలివాడి మొదలు పెద్ద ఆఫీసరు వరకూ అందరూ భయభక్తులతోనే వుంటారు. 'ఏమో ఈ దుర్మార్గుడు ఎవరి మెడలో తాడు తెంచుతాడో!' అని.

అయితే భయంకరంగా వుండడు. ఎప్పుడూ చిరునవ్వు పెదవులమీద అతికించుకునే వుంటాడు. నోట్లో పంచదార పోసుకున్నట్లు ఎంత తియ్యగా మాట్లాడుతాడో అంతరంగంలో అంతకు పదిరెట్లు విషం కక్కుతూ వుంటాడు.

"ఇదుగో ఇంజనీర్‌గారూ! గాడిద పని గాడిద, కుక్కపని కుక్కా చెయ్యాలండీ. మీకెందుకీ కుక్కపని?" అని నయనా భయనా చెప్పి చూసినా సుబ్బారావు దారికొస్తేనా?

వుహూఁ....

"ఇదుగో సారూ! నా ఒక్కడికోసమేనా ఇలా అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకుంటూ, నానా గడ్డీ కరిచి సంపాదించాలనుకుంటున్నది నేనేం మూట కట్టుకోవడం లేదు. నలుగురి కోసమే నా కష్టమంతా!" అనేవాడు తరచుగా.

ఆ మెట్ట వేదాంతం సుబ్బారావుకి అర్థమై ఛస్తేనా?

జగన్నాథం చెప్పినా చెప్పకపోయినా ఆయన నిసలైన సోషలిస్టు. ఏ కాంట్రాక్టులో ఎవరెవరికి ఎంతెంత ముట్టజెప్పాలో, ఇరవై ఏళ్ళ అనుభవం వుంది. రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు కళలో ఆరితేరిన కళాకారుడు.

అవసరమైతే జుట్టు పట్టుకోడానికిగాని, చెప్పులు నాకడానికిగాని వెనుదియ్యడని తెలియని వాళ్ళెవ్వరు?

సుబ్బారావు వచ్చి చార్జి తీసుకున్న తర్వాత సంవత్సరం లోగానే ఏభై వేలు నష్టపోయిన జగన్నాథం బోనులో బంధించబడ్డ పెద్దపులిలా గాండ్రించసాగాడు.

పగబట్టిన త్రాచుపాములా సమయంకోసం ఎదురుచూస్తున్నాడు.

ఒకరోజు సుబ్బారావు, అతని భార్య షికారుగా వూరి బైటికి వెళ్ళి చీకటిపడిన తర్వాత ఇంటికి వస్తుంటే, లారీక్రింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఈ ప్రపంచంలో అన్నిటికంటే చౌకయినది మనిషి ప్రాణం అనే సిద్ధాంతంలో నమ్మకమున్న జగన్నాథం 'ఈ పని ఎప్పుడో చేసి వుంటే ఏభై వేలు మిగిలి వుండేవి' అనుకుని వుంటాడు.

పెళ్ళీడుకొచ్చిన కూతురు, హైస్కూల్లో చదువుకుంటున్న కొడుకూ దిక్కులేని వాళ్ళయి పోయారు.

సుబ్బారావుకి వెనకా ముందూ ఆస్తిపాస్తు లేవీ లేవని తెలిసి కృష్ణమూర్తికి ఆశ్చర్యం కలగలేదు.

అనాథలైపోయిన శాంతినీ, ఆమె తమ్ముడు రాముని చూసి చలించిపోయాడు కృష్ణమూర్తి.

*    *    *

ధర్మవరం పట్టుచీరలు ఒకొ్కక్కటే ట్రంక్ పెట్టిలో నుంచి బైటపడేస్తున్నాడు.

మరియమ్మ వాటి నాణ్యం పరిశీలిస్తుంది.


జరీ పూలతో నేసిన రంగురంగుల పట్టు చీరలు చూస్తుంటే శాంతి కళ్ళు జిగేలుమంటున్నాయి.

రెండువందల చిల్లర ఖరీదువున్న నీలం రంగు పట్టుచీర తీసుకుంది మరియమ్మ.

"నువ్వూ ఒకటి తీసుకో శాంతీ" అంది.

"వద్దండీ,"

"ఫరవాలేదు తీసుకో. ఇతను మనకు తెలిసినవాడే. నెలనెలా వస్తుంటాడు. నెలనెలా ఏభై ఇస్తుంటే సరి. నాలుగు నెలల్లో బాకీ తీరిపోతుంది" అని సర్దిచెప్పి శాంతితో పట్టుచీర



కొనిపించింది.

ఆమె చిరకాలంగా కట్టుకోవాలని కలలు కంటున్న గులాబీ రంగు పట్టుచీర తీసుకుంది.

కాని నెలనెలా ఏభై ఇవ్వాలంటే ఎంత కష్టమో? ఆయనకు వచ్చే జీతంలో ఎన్ని కోత లున్నాయో? ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్, ఫెస్టివల్ అడ్వాన్సు వగైరా!....

పట్టుచీర తీసుకున్నానన్న సంతోషం ఎంతో సేపు నిలవలేదు, భర్త ఏమంటాడో? అని.

"నువ్వేం భయపడకు అమ్మాయీ! బాకీ తీర్చే మార్గం నేను చూపిస్తాగా." అంది మరియమ్మ.

"ఇంకో నెలలో నేను జాకెట్లు కుట్టగలనా?" ఆశగా అడిగింది శాంతి.

"అప్పుడేనా? ఒక సంవత్సరమైనా గట్టిగా నేర్చుకుంటే ఫరవాలేదు,"

'సంవత్సరం గడపాలా?' శాంతి నీరసపడి పోయింది.

"రాణి చాలా తొందరగా నేర్చుకుంది అను కుంటాను" అంది.

మరియమ్మ నవ్వింది.

"అయితే రాణి టైలరింగ్ చేసి డబ్బు సంపాదిస్తుందని అనుకుంటున్నావా?"

"మరి."

"ఆవిడకి కొన్ని ఖాతాలున్నాయిలే. రహస్యం గానే అనుకో. నెలకో వెయ్యి అవలీలగా సంపా దిస్తుంది. కంట్రాక్టర్ సుబ్బరాజు, సినిమాహాలు మేనేజర్ ఒకాయనా. ..ఇంకా వున్నారులే...."

మరియమ్మ మాటలు వింటుంటే ముచ్చెమ టలు పోశాయి శాంతికి. నిజమేనా? రాణీ అటు వంటి మనిషా?

"ఆఁ....తప్పేముందిలే. కష్టపడి ఎంత కాలం సంపాదిస్తాం చెప్పు. జాకెట్టు కుడితే ముష్టి రూపాయి, లంగా కుడితే రెండు. ఎన్ని కుడితే ఒక వంద కూడతాయి చెప్పు? అదే కాసేపు కళ్ళు మూసుకుంటే వంద కాగితం చేతిలో పడుతుంది" మరియమ్మ మామూలుగా చెప్పుకుపోతోంది.

"రాణీ వాళ్ళాయనకి ఈ విషయం తెలి యదా?" ఆశ్చర్యంతో అడిగింది,

"ఎలా తెలుస్తుంది?" అని ఎదురుప్రశ్న వేసి "అంతా రహస్యంగానే సాగుతుంది. అల్లరి చిల్లరగా తిరగటం కాదుగా. హైక్లాస్...." అంది మరియమ్మ.

శాంతి ఎంత వుత్సాహంతో టైలరింగ్ నేర్చుకోవాలని మొదలుపెట్టిందో ఇప్పుడదంతా జారిపోయింది. అయితే రాణీ సంపాదన రహస్యం ఇదన్నమాట.

"నీకు తెలియదు. చాలామంది అంతే. పైకి ప్రతివ్రతల్లా వుంటారు. లేకపోతే ఇళ్ళనిండా వుండే ఫర్నిచర్, ఫ్రిజ్‌లూ మొగుళ్ళు సంపా దిస్తున్నారా? వాళ్ళు తెచ్చేది తిండికే కనాకష్టం. ఇంక సరదాలెప్పుడు తీరతాయి" అంది మరియమ్మ.

శాంతి బెల్లంకొట్టిన రాయిలా వులుకూ పలుకూ లేకుండా కూర్చుండిపోయింది.

"అన్నట్లు ఇద్దరు పిల్లల తర్వాత నువ్వు ఆపరేషన్ చేయించుకున్నావనుకుంటాను."

"అవునండీ" అంది శాంతి తల వంచుకుని.

"అయితే ఇక పిల్లా పీచూ బాధేలేదు. అన్నట్లు ఆ ఎదురు మేడ ఎవరిదో తెలుసా?"

"లేదండీ."

"సుబ్బరాజుది. లక్షాధికారి."

"అలాగా!"

"ఆఁ... అతను నువ్వంటే మోజుపడు తున్నాడు." నెమ్మదిగా అంది మరియమ్మ.

శాంతి కలలో వింటున్నదానిలా వులిక్కి పడింది.

ఆమె గుండెలమీద నుంచి రోడ్‌రోలర్ పోతున్నట్లనిపించి వూపిరాడక వుక్కిరిబిక్కిరై పోయింది.

తడబడుతూ లేచి "వెళ్ళొస్తానండీ" అంది.


* * *

సుబ్బారావు పోయాక ఆ ఇంటితో వున్న ఆత్మీయత కారణంగా రోజూ వెళ్ళి పిల్లల్ని చూసి వస్తున్నాడు కృష్ణమూర్తి.

దినవారాలు పూర్తి కాగానే బంధువులు ఎవరిదారిన వాళ్ళు పోయారు.

'దిక్కులేనివాళ్ళకి దేవుడే దిక్కట.'

'బ్రతికున్నప్పుడు ఎవరికేం మేలు చేశాడు?'




'తను ఒక్కడే నిజాయితీ పరుడనని ఎంత గర్వం?'

'బంధుప్రీతి గూడా లేదు ఆ మనిషికి'

తలా ఒక మాట అనడంగూడా విన్నాడు కృష్ణమూర్తి.

నవ్వుతూ, త్రుళ్ళుతూ తిరిగే శాంతి గుర్తు పట్టకుండా అయిపోయింది.

గలగలా పారే సెలయేరు మంచుముద్దలా ఘనీభవించిపోయినట్లు ఆమె చలనం లేకుండా మంచంమీద పడివుండడం చూసి కృష్ణమూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తల్లి చచ్చిపోయిన కుక్కపిల్లలా పిచ్చి పిచ్చిగా చూస్తున్న రాము కన్పించేసరికి అతని కడుపు తరుక్కుపోయింది.

అతని బలవంతంమీదే పిల్లలిద్దరూ కాస్త ఎంగిలి పడుతున్నారు.

రోజులు గడిచేకొద్దీ శాంతిమీద జాలి మాత్రమేకాక మరేదో భావం చివురిస్తున్నట్లు గ్రహించాడు.

ఏం? అయితే? అనుకున్నాడు.

'ఎంత త్యాగంచేసి అయినా సరే శాంతిని పెళ్ళి చేసుకోవాలి' అని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు అతనికి బాగా గుర్తుంది.

అప్పుడే చీకటిపడింది. ఇంకా భోజనమైనా చేయలేదు.

శాంతికి వెంటనే ఈ విషయం తెలియ జెయ్యాలి అనుకున్నాడు.

మధురనాదం ఏదో అతని వీనుల విందు చేస్తోంది.

తియ్యటి భావాలతో పరవశించి పోతూ శాంతికోసం బయద్దేరాడు.

రోజూ చూసే దృశ్యాలే ఎంతో కొత్తగా కన్పిస్తున్నాయి ఎందుకో.

మామిడిచెట్లు చిగిర్చి తలలు వూపుతూ వుంటే అతనికి ఎంతో అందంగా కనిపించింది.

పచ్చటి పొలాలమీదనుంచి వీస్తున్న పైరు గాలి అతనికి చల్లగా తగిలింది.

వెన్నెల మైకంలో మత్తుగా జోగుతున్నాయి సరివి తోటలు.

ఇంటి ముందు ఆగిపోయాడు కృష్ణమూర్తి.

శాంతి ఏమంటుందో?

"ఎవరూ?"

"నేనే."
గేటు తెరిచింది.
"మీరా! రండి" అంది శాంతి.
"భోజనం చేశారా?" అన్నాడు పలకరింపుగా.
"లేదు అప్పుడేనా?" అంది.
"రాము ఏం చేస్తున్నాడు?"
"చదువుకుంటున్నాడు."
తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు అతనికి.
"నిల్చుండిపోయారేం? రండి లోపలకి."
యాంత్రికంగా అడుగులు వేశాడు లోపలకి.
ఎంత అందంగా వుంది శాంతి?
అప్పటివరకూ అంత అందాన్ని గుర్తించ లేదు ఎందుకని?
అప్పుడు శాంతి తన పై అధికారి కూతురు.
ఇప్పుడు దిక్కులేని అనాధ.
వాస్తవమే అయినా కృష్ణమూర్తికి ఎందుకో చిరాకు కలిగింది.
"శాంతీ."
శాంతి కళ్ళెత్తి చూసింది. కృష్ణమూర్తి ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడని గ్రహించింది. ఆమె అంతర్యం అతని పిలుపుని గ్రహించింది.
"వూఁ...." అంది
"నేను యీ రోజు ఒక నిర్ణయం తీసుకున్నాను."
"ఏమిటి?"
"నీకు అభ్యంతరం లేకపోతే."
"నా అభ్యంతరమా? .... " ఆశ్చర్యంతో అంది శాంతి.
"మనం పెళ్ళి చేసుకుందాని."
అతను చెప్పే తీరుచూసి అంత బాధలో వున్నా ఆమెకు నవ్వు వచ్చింది.
'కృష్ణమూర్తి ఎంత మంచివాడు.'
శాంతి దగ్గరగా వచ్చింది.
అతని అరచేతిని తన చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టింది. కృతజ్ఞతాభావంతో ఆమె హృదయం ద్రవించింది.
కృష్ణమూర్తికి, శాంతికి పెళ్ళయింది.
పదేళ్ళు దొర్లిపోయాయి.

రాము బుద్ధిగా చదువుకుని బ్యాంక్‌లో వుద్యోగం చేస్తున్నాడు. ప్రేమించి పెళ్ళి చేసుకొని హాయిగా వున్నాడు.
యాంత్రికంగా రోజులు గడిచిపోతున్నాయి.
కాని శాంతిలో రోజురోజుకీ ఏదో మార్పు వస్తోంది.
ఇరుగు పొరుగుల పరిసరాల ప్రభావం కావచ్చు.
అందరిలాగా సుఖపడాలనే ఒక చత్రయం పెరిగిపోతోంది ఆమెలో.
మనిషికి తిండి, బట్ట మాత్రమేగాక తృప్తి గూడా కావాలి.
కాని తృప్తికి అంతెక్కడ?
కృష్ణమూర్తికి ఆఫీసుపని చెయ్య బుద్ధి కావడంలేదు.
తల భారంగా వున్నట్లనిపించింది.
పెన్ను మూసేసి క్యాంటీన్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు.
కంట్రాక్టర్ లోకనాధం తన భారీ శరీరాన్ని అతిప్రయాసతో మోసుకుంటూ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.
"నమస్తే కృష్ణమూర్తిగారూ."
"నమస్తే."
లోకనాధం స్వీట్స్ తెప్పించాడు.
తర్వాత వేడివేడి కాఫీలు వచ్చాయి.
అధికారులు ఎవరెంత సంపాదించిందీ, ఎక్కడెక్కడ యిళ్ళు కట్టిస్తున్నదీ, పొలాలు తోటలూ కొంటున్నదీ, వివరాలు చెప్పసాగాడు లోకనాధం.
కృష్ణమూర్తి పరధ్యానంగా వినసాగాడు.
అతని జీవితంలో ఎన్నడూ లేని సంఘర్షణ మొదలైంది. నీతికీ, అవినీతికీ, అబద్ధానికీ నిజానికీ మధ్య అతని మనసు నలిగిపోయింది.
"మీ పక్కసీట్లో గుమాస్తా విఠల్‌రావు బావమర్దిని డాక్టర్ని చేస్తున్నాడు తెలుసా?" అన్నాడు లోకనాధం.
"వూఁ...."కొట్టాడు కృష్ణమూర్తి.
"మీరొక్కరే ఎందుకు మడికట్టుకోవాలో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు లోకనాధం.




"నాకు మాత్రం ఏం పట్టిందీ? నావల్ల ఏం మేలు జరుగుతుంది దేశానికి?" కసిగా అన్నాడు కృష్ణమూర్తి.

అతని మాటలు కొత్తగా వినిపించాయి లోకనాథానికి.

"మీరేం చెయ్యలేరనేది మీకు తెలుసు గదా? మీ వాటా మీరు తీసుకుంటే సరిపోయె. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు మరి. కుర్రవాళ్ళప్పుడు ఏవో ఆదర్శాలుంటాయనుకోండి. మీరింకా కుర్రాళ్ళేనా?" పెఋ్ఖన నవ్వాడు లోకనాథం.

"నా మొఖం ఆదర్శాలు. మా మామగారు మీకు తెలుసు గదా?"

"తెలియకేం. సుబ్బారావుగారి పేరు చెప్తే కంట్రాక్టర్లు మంచినీళ్ళు తాగరు."

"ఏం లాభం. అర్ధాంతరంగా హత్య చేయించారా? పిల్లలు దిక్కులేని పక్షులై పోయారా?"

"అవును. అందరికీ తెలిసిందే." విచారిస్తూ అన్నాడు లోకనాథం.

"నేను ఇన్నాళ్ళూ గుడ్డివాడిలా ప్రవర్తించాను."

"అదేకదా నేను మొత్తుకునేది. అన్నట్లు నా బిల్లు మూడునెలల నుంచీ మీ సీట్లో...."

"ఈ రోజు పాస్‌చేస్తాలెండి."

"థాంక్స్."

పచ్చనోటు కృష్ణమూర్తి జేబులోకి వెళ్ళింది.

"ఇప్పుడెందుకు?...."

"ఉంచండి...." నవ్వుతూ వెళ్ళిపోయాడు లోకనాథం.

ఎదురీతకు గూడా హద్దువుంటుంది. అవినీతి ఉప్పెన కెరటాల తాకిడికి అతను ఓడిపోయాడు. ఇప్పుడిక ఎదురీదే శక్తి అతనికి లేదు.

* * *

తన ఇంట్లో అడుగు పెట్టబోయే ఇనుప బీరువా, గ్రైండర్, సోఫాసెట్టు, ప్రెషర్ కుక్కర్ వగైరా తల్చుకొని శాంతి హృదయం గంతులేస్తోంది.

'పట్టుచీరలు, రవ్వల నెక్లెస్'.. చంపుకున్న కోర్కెలు వూపిరిపోసుకుంటున్నాయి.

తన యింటినిండా నిండబోయే సామాను తలుచుకుంటే ఆనందం కలుగుతున్నా మరో వైపు అస్పష్టమైన భయం ఏదో మనసుని వణికిస్తున్నది.

చీకట్లో నెమ్మదిగా నడుస్తున్న శాంతి ధైర్యం తెచ్చుకుంది. సంఘంలో తనకు కలుగబోయే మిధ్యాగౌరవం మత్తులో పడిపోయింది.

మరియమ్మ అన్నట్లుగా తనవంటి అందగత్తె

ఏ ఆఫీసర్‌కో భార్య అవవలసింది కాని దుర దృష్టవశాత్తు ఈ దిక్కుమాలిన గుమస్తా పాలిట బడింది. భగవంతుడా ఏ జన్మలో ఏం పాపం చేశానో ఈ జన్మలో యింతటి కఠినశిక్ష విధిం చావు అనుకుంది శాంతి.

కనిపించని విషసర్పం ఆమెని కాటేసింది.

పిచ్చిపిచ్చి ఆలోచనలు జలగలై ఆమె నెత్తురు పీల్చివేస్తున్నాయి.

అశాంతి ఆరని జ్వాలలా ఆమెను దహించి వేస్తున్నది.

భర్తమీద ప్రేమ, విశ్వాసమూ నీతి నిజాయి తీలు ఆ జ్వాలలోపడి దహించుకుపోతున్నాయి.

అమావాస్య చీకటి.

ఎదురుగా ఎవరు వస్తున్నారో గూడా తెలి యడంలేదు.

అయినా ఆమె ముఖం కన్పిస్తుందేమోనని భయంతో ముసుగు కప్పుకుంది.

నక్షత్రాలు తనను గమనిస్తున్న లోకుల కళ్ళలా అనిపించి భయంతో వణికింది ఆమె.

తడబడుతున్న అడుగులతో మరియమ్మ ఇల్లు చేరుకుంది శాంతి.

ఇంటిముందు లైటు వెలుగుతోంది.

కుండీలో గులాబీమొక్కకు నిన్న విచ్చిన పువ్వు మంచులో తడిసి ఒక్కొక్క రెక్క రాలుస్తూ 'జీవితం యింత స్వల్పమా' అను కుంటూ కళ్ళు మూస్తోంది.

శాంతి తలుపు కొట్టగానే ఆమె కోసమే ఎదురుచూస్తున్న దానిలా తలుపు తీసింది మరియమ్మ.

"ఇంతాలిస్యం చేశావేం?" అంది.

శాంతి మాట్లాడలేదు. నవ్వలేక నవ్వింది. ఆ నవ్వులో ప్రాణంలేదు. చచ్చిపోయిన మనిషి

---

## వెన్న అమ్మబడదు

"'ఫలానా' బట్టర్ బిల్డ్స్ బెటర్ బాడీస్" ప్రకటన.

"బాబూ నాకు 'ఫలానా' బట్టరివ్వరా, బిక్కసచ్చిపోయున్నాను. బెటరు బాడీ కావాల్నాకు."

"ఊరకనే ఇవ్వరయ్యా."

"ఏం చెయ్యాలి మరి?"

"కొనుక్కోవాలి."

"ఏమెట్టి కొనడం, డబ్మేల్నవు నాకాడ."

"సంపాదించు."

"ఎక్కడ? ఎలాగ?"

"నీకు 'ఫలానా' బట్టరే కావాలా?"

"కావాలి బాబు. నీ పున్నెముంటాది,"

"అయితే కన్నం వేసయినా సంపాదించు."

"ఏటి?"

"డబ్బు."

"ఎందుకు?"

"'ఫలానా' అక్కరలేదా?"

"కావాలి."

"అందుకే డబ్బు!"

"మరయితే డబ్బెట్టి కొనాలని రాయవా? డబ్బా కరీదు రాయవా?"

"ఆఁ........!"

—నిష్టల వెంకటరావు

నవ్వినట్లు కృత్రిమంగా వుంది.

సుబ్బరాజు ఎర్రబడిన కళ్ళతో మత్తుగా చూస్తున్నాడు.

మరియమ్మ విజయగర్వంతో అతని వైపొక సారి చూసి నవ్వి వెళ్ళిపోయింది.

శాంతికి అతన్ని చూస్తుంటే మనిషిలా కని పించడం లేదు. తనని కబళించడానికి వచ్చిన భక్షకిలా సంఘంలో స్వైర విహారం చేస్తున్న స్వార్థానికి ప్రతిబింబంలా....

ఆమె తల తిరిగిపోతోంది ఆమె మనసు లాగే వాతావరణం గూడా వేడెక్కిపోయినట్లని పించింది. చెమటతో ఆమె శరీరం తడిసి పోయింది.

సుబ్బరాజు నెమ్మదిగా కదిలి వస్తున్నాడు.

పారిపోదామా అనుకుంది.

కాని——

ఆమె కాళ్ళు గజగజ వణికాయి.

భయంతో శరీరం కంపించిపోయింది.

పాదాలు నేలకు అంటుకుపోయినట్లు ఆమె కదలలేకపోయింది.

కొండమీద నుంచి దూకే జలపాతంలాగా అతను ఆమెమీద పడి కౌగలించుకున్నాడు.

ఎందుకో తొలిరేయి జ్ఞాపకం వచ్చింది.

గదిలో గుబాళిస్తున్న పరిమళం, అగరొత్తుల సువాసన, సిగ్గుతో పరవశించిపోతున్న మనసు. కాని ఇప్పుడూ——

బంగారం వాసన ముక్కుకి తాకుతోంది,

నోట్లకట్లని కౌగలించుకున్నట్లు అనుభూతి.

*　　*　　*

వంటగది నిండా స్టెయిన్‌లెస్ స్టీల్ సామాను, వంట చేసుకోడానికి - గ్యాస్‌స్టవ్ ప్రెషర్ కుక్కరూ, వేడినీళ్ళకు రాగిబాయిలర్, పప్పు రుబ్బుకోడానికి గ్రైండర్, బెడ్‌రూంలో ఫోంబెడ్, దానిచుట్టూ నైలాన్ దోమతెర, పైన గిరగిరా తిరుగుతూ సీలింగ్‌ఫ్యాన్, డెకోలామ్ టేబుల్‌మీద ఐదుబ్యాండుల రేడియోసెట్, ఒక మూలుగా మినీఫ్రిజ్, ఇక హాల్లోకి వస్తే సోఫాసెట్, గాద్రెజ్‌బీరువా, మాష్టర్ వాల్‌క్లాక్ వగైరా....

ఆ ఇల్లు శాంతి వాళ్ళదా? కాదా? అని ఎవరూ సనిదేహించనవసరం లేదు.

అది కృష్ణమూర్తి ఇల్లే.

ఇవన్నీగాక కృష్ణమూర్తి ఖాతాలో బ్యాంక్ బ్యాలన్సు ఎంతవుందో ఎవరికి తెలుసు?

'మా అబ్బాయిని ఇంజనీర్ చెయ్యాలనీ, మా అమ్మాయిని డాక్టరు చెయ్యాలనీ' మాటల సందర్భంగా శాంతి అంటూవుంటుంది.

కాని శాంతి హృదయంలో మాత్రం రోజు రోజుకీ అశాంతి పేరుకుపోతోంది. ఇరుగు పొరుగు వాళ్ళు గుచ్చి, గుచ్చి చూసేచూపులు ఆమె గుండెల్ని ఈటెలై పొడుస్తున్నాయి.

దొంగతనం చేసి తప్పించుకుని తిరుగుతున్న దానిలా బాధపడసాగింది. సూటిగా ఎవరి మొఖంలోకీ చూడలేకపోతోంది.

పుట్టిన దాదిగా గుండెల్లో దాచుకున్న పవిత్రతనంతా ఒక్కసారిగా కోల్పోయిన ఆ భయంకరక్షణం మాటిమాటికీ గుర్తుకొచ్చి మనసు వికలమైపోసాగింది.

మరియమ్మ ఆమె అంతర్యంలో ఏదో మత్తు నింపింది. ఆమె వున్మత్తురాలైపోయింది. కాని అప్పుడప్పుడూ ఆ మత్తు విడిపోతూ వుంటుంది.

అప్పుడామె భయంతో వొణికిపోతుంది. అణుచుకోలేని ఆవేదనతో కంపించిపోయి వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఏడుపులోనే ఆమెకు మనశ్శాంతి లభించేది.

కొద్దిరోజుల్లోనే ఆమె కళ్ళు గుంటలు పడ్డాయి. ఆమె చూపులు స్థిరంగా నిలవడం లేదు. కళ్ళెత్తి ఎవర్నీ చూడలేకపోతోంది. ఆమె గుండెల నిండా భయం....గూడు కట్టు కుంది. ముఖంలో కళాకాంతులు మాయమై పోతున్నాయి.

కృష్ణమూర్తి గూడా చాలా మారిపోయాడు.

వ్యసనాలు నేర్చుకున్నాడు. ఏ అర్థరాత్రికో ఇంటికి చేరుకోడం అలవాటైపోయింది.

ఆ రోజు.

రాత్రి ఎనిమిది దాటింది.

కృష్ణమూర్తి ఇంటికి రాలేదు,

పిల్లలు అన్నం తిని పడుకున్నారు.

కృష్ణమూర్తి తల్లి వంటింట్లో సామాను

సర్దుతోంది.

శాంతి హాల్లో కూర్చుని ఏదో సినిమాపత్రిక పేజీలు తిరగేస్తూ వుంది.

"అక్కాః...."

తలెత్తి చూసింది శాంతి.

వాడు మరియమ్మ కొడుకు.

"ఏం?"

"అమ్మ రమ్మంటోంది.అర్జెంట్"అన్నాడు.

శాంతి త్వరత్వరగా డ్రెస్ చేసుకుని "అత్తయ్యాః... మరియమ్మ ఇంటికి వెళ్తున్నాః అర్జెంటుగాఎవరివో బట్టలుకుట్టాలట...."అంది.

"ఇంత రాత్రి ఎందుకే అమ్మాయీః అబ్బాయి వస్తాడో ఏమో?....అయినా మన మిషన్ మన యింట్లో పెట్టుకుంటే యిక్కడ కుట్టుకోవచ్చుగాః" అంటూ గొణుక్కుంది అత్తగారు.

"ఆఁ .... ఇక్కడికి ఎవరువస్తారు? ఏం లాభం. సర్లే ఆయన వస్తే భోజనం వడ్డిం చెయ్యిః ఇప్పుడే వస్తాః"

శాంతి బయల్దేరింది.

చీకట్లో నెమ్మదిగా నడుస్తున్న శాంతి జీవితం గూడా చీకటైపోతున్నట్లనిపించింది. కనుచూపు మేరలో కాంతిరేఖలు కనిపించడం లేదు. ఈ శూన్యంలోనుంచి బైటపడే మార్గం లేదా?

ఆమె ఆలోచిస్తోంది.

ఆయనకి ట్రాన్స్ఫర్ వస్తే బాగుండును.

ఈ చీకటి జీవితానికి గుడ్‌బై చెప్పెయ్య వచ్చు.

"రా....శాంతీ" అంటూ ఆహ్వానించింది మరియమ్మ.

తర్వాత ఇద్దరూ కలిసి రిక్షా ఎక్కారు.

"ఎక్కడికి?" అంది శాంది భయంగా.

"చెప్తాగాః...." అంది మరియమ్మ.

మూడంతస్థుల హోటల్ ముందు ఆగింది రిక్షా.

"హోటల్లోకా? వద్దు మరియమ్మాః....నాకు భయంగా వుంది. ప్లీజ్...."

"భయమా? ఎందుకూ?...." అని నవ్వి "మన ఇంటిలాగే వుంటుంది" అని సర్ది చెప్పింది.

"పద ఎంతసేపు రోడ్డుమీద నిల్చుందాం? అందరికళ్ళూ మనమీదే వుంటాయి" మరియమ్మ కోప్పడింది.

శాంతి అశక్తురాలై పోయింది.

కీలుబొమ్మలా నడిచింది.

* * *

తలుపు తెరవగానే కనిపించిన పోలీసుల్ని చూసి గుండెల్లో ఎవరో కత్తితో పొడిచినట్లు కెవ్వుమంది శాంతి.

హోటల్ని పోలీసులు రైడ్ చేశారని అర్థమై ఆమె కళ్ళు బైర్లుక్రమ్మాయి. తనకి కనిపించని అదృశ్యశక్తి ఏదో తనని అంధకార వలయం లోకి తోసివేసినట్లు నేలమీదకు ఒరిగిపోయింది.

కాటువెయ్యడానికి తోకమీద లేచి నిల్చున్న త్రాచుపాముల్లా కనిపించారు పోలీసులు.

ఆమె తలమీద ఎవరో పెద్ద దెబ్బకొట్టినట్లు అదిరిపోయింది.

కొంతసేపు ఆమె మనసు మొద్దుబారిపోయి ఆలోచనలు ఆగిపోయాయి.

తర్వాత తనని పోలీసులు అరెస్ట్ చేశారని జ్ఞాపకం వచ్చి బాధతో మెలికలు తిరిగి పోయింది. వూపిరి ఆగిపోతున్న దానిలా వుక్కిరి బిక్కిరై పోయింది.

అవమానంతోను దుఃఖంతోనూ ఆమె ముఖాన్ని చేతులమధ్య దాచుకుని వెక్కి, వెక్కి ఏడ్చింది శాంతి.

* * *

పోలీస్ స్టేషన్‌లో—

తనని బెయిల్‌మీద వదిలిపెట్టేవాళ్ళకోసం ఎదురుచూస్తున్నాడు కృష్ణమూర్తి.

అతన్ని కొన్ని గంటలముందే అవినీతి నిరోధక శాఖవారు లంచం తీసుకున్న నేరానికి అరెస్ట్ చేశారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి ప్రవేశిస్తున్న తన భార్యని చూశాడు కృష్ణమూర్తి. ఆమె ప్రక్కనే ఎవరో సిల్కులాల్చీ పెద్దమనిషి గూడా వున్నాడు.

'తనకి బెయిల్ ఇప్పించి విడుదల చేయించ డానికి ఎవరో పెద్దమనిషిని వెంటబెట్టుకుని వస్తున్నది శాంతి' అనుకుంటూ ఆనందపడ సాగాడు కృష్ణమూర్తి. □